క్లుప్తంగా

పాఠశాల ముఖద్వారానికి విరాళం

కంచిలి: మండలంలోని డి.జి.పురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు నూతనంగా నిర్మిస్తున్న ముఖద్వారానికి ముండ్ల జెడ్పీ హెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ పాఢి రూ. 15 వేలు విరాళాన్ని ఇచ్చారు. ఈ మొత్తాన్ని డి.జి.పురం పాఠశాల హెచ్ఎం ఉప్పాడ రమేష్‌కు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అధికారికి సన్మానం



శ్రీనివాసరెడ్డి దంపతుల్ని సన్మానిస్తున్న దృశ్యం

కంచిలి: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సుదీర్ఘకాలం సేవలందించిన చల్లా శ్రీనివాసరెడ్డి సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల శ్రీనివాసరెడ్డికి పదోన్నతి వచ్చి ఉపాధి హామీ పథకం ఏపీడీగా పలాసకు బదిలీ అయ్యారు. దీంతో ఆయన సేవలకు గుర్తుగా ప్రస్తుత ఎంపీడీవో నీరజ అధ్యక్షతన మండలంలో ఉన్న పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు కలిసి శ్రీనివాసరెడ్డి దంపతుల్ని శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత

కవిటి: డాక్టర్ వైఎస్సార్ బీమా పథకం ఆపదలో ఉన్న కుటుంబాలకు వరమని వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. ఆర్.భైరిపురం గ్రామానికి చెందిన పి.భాస్కరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన వైఎస్సార్ బీమా పాలసీదారుడు. దీంతో తక్షణ సాయంగా రూ. పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని నామినీగా ఉన్న అతని భార్య ఊరిమికకు శుక్రవారం అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

టెక్కలి రూరల్: వాహనదారులు, వ్యాపారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని టెక్కలి సీఐ పి.పైడయ్య అన్నారు. ఇటీవల బదిలీపై టెక్కలి వచ్చిన ఆయన శుక్రవారం ట్రాఫిక్ రూల్స్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఇందిరాగాంధీ జంక్షన్ వరకు నడుచుకొని వెళ్లి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడారు. వాహనదారులకు ఎటువంటి ఆటంకం లేకుండా షాపులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డుపై షాపులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా 'ఆపస్' ఆవిర్భావ దినోత్సవం

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఇన్నేసుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఆపస్ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలు, హక్కులపై అలుపెరగని పోరాటం చేసిన సంఘంగా ఆపస్ విశిష్ట సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షులు బి.శంకరం, ప్రధాన కార్యదర్శి తారకేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బదిలీ తహసీల్దార్‌కు సత్కారం

కాశీబుగ్గ: పలాస తహసీల్దార్‌గా పని చేసి బదిలీపై వెళ్లిన లంబాల మధుసూదన్‌రావును కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది శుక్రవారం రాత్రి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లడం బాధగా ఉందన్నారు. ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో సంతోషంగా ఇక్కడ విధులు నిర్వహించానన్నారు. భూ సమస్యలపై తగాదాలు లేకుండా కోర్టులో ఉన్న కేసులను పరిష్కారం దిశగా కృషి చేశానన్నారు. మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, ఎంపీడీవో రమేష్‌నాయుడు, మండలస్థాయి అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పౌరసరఫరాల శాఖ డీటీ రవికుమార్, ఆర్ఐ నిరంజన్, వీఆర్వోలు సోమేశ్వరరావు, ఖగేశ్వరరావు, సర్వేయర్ ఫాల్గుణరావు ఉన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవు గ్రామానికి చెందిన బాలిక గత నెల 31వ రాత్రి నుంచి కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు చేసినట్టు ఎస్సై మధుసూదనరావు తెలిపారు. కేసు చేస్తున్నామని చెప్పారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాశీబుగ్గ: సున్నాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన జగ్గారావు గాయపడ్డాడు. నడుచుకొని వెళ్తున్న జగ్గారావును అల్లుకోలు గ్రామానికి చెందిన అనిల్ బైక్‌తో ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. 108 వాహన ఈఎంటీ పి.సత్యం, వెంకట్రావులు ప్రథమ చికిత్స చేసి పలాస ఆస్పత్రిలో చేర్పించారు.

ఎమ్మెల్సీ పరామర్శ

ఇచ్ఛాపురం: పట్టణంలోని పలువురు కుటుంబాలను ఎమ్మెల్సీ నర్తు రామారావు పరామర్శించారు. డబ్బూరి వీధికి చెందిన ఎం. జయలక్ష్మి ఇటీవల చనిపోవడంతో ఆమె కుటుంబ సభ్యులను, ఖజాన వీధిలో నివాసముంటున్న మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు సయ్యద్ సుల్తాన కుమారుడు ప్రేమ్‌సర్దార్‌ఖాన్ ఇటీవల చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు.

వారిద్దరూ జిల్లాకు చేసింది శూన్యం

- నందిగాం ఎంపీపీ శ్రీరామమూర్తి, సర్పంచ్‌లు



సమావేశంలో ఎంపీపీ శ్రీరామమూర్తి తదితరులు

నందిగాం: మంత్రిగా ఉండి కింజరాపు అచ్చెన్నాయుడు, పదేళ్లుగా ఎంపీగా ఉన్న రామ్మోహన్‌నాయుడు జిల్లాకు చేసిందేమీలేదని నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో పలువురు సర్పంచ్‌లతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీగా రామ్మోహన్‌నాయుడు జిల్లాకు చేసిన మేలుఏమిటో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్‌చేశారు. కేంద్ర ప్రభుత్వం రూ. 50 కోట్లు నిధులు ఇస్తే కనీసం ఖర్చు చేసుకోలేని అసమర్థుడు అని అన్నారు. అలాంటి వ్యక్తి పేరాడ తిలక్‌కు పోటీ ఏమిటని ప్రశ్నించారు. తిలక్ గ్రామీణస్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీవెనలతో వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్థాయికి ఎదిగిన వ్యక్తి అని అన్నారు. తిలక్ నిత్యం ప్రజలతో ఉండి వారి కష్టసుఖాలు తెలుసుకునే వ్యక్తిగా అందరికీ సుపరిచితుడే అని అన్నారు. శ్రీకాకుళం ఎంపీగా గతంలో ఎన్నికైన వారంతా దేశ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారన్నారు. అయితే రామ్మోహన్‌నాయుడు మాత్రం సినీ యాక్టర్‌లాగ పోజులు ఇవ్వడం తప్పా సాధించింది ఏమీలేదని ఎద్దేవా చేశారు. విభజన చట్టంలో భాగంగా రాష్ట్రానికి 23 సంస్థలు వస్తే జిల్లాకు ఒక్కటీ కూడా తెచ్చుకోలేని అసమర్థ ఎంపీగా మిగిలిపోయారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో టెక్కలి అసెంబ్లీ, శ్రీకాకుళం పార్లమెంటు స్థానాల నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసే వ్యక్తులను గెలుపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు మాట్లాడుతూ.. టెక్కలిలో అచ్చెన్నాయుడుకు ఓటమి తప్పదని తెలుసుకునే గ్రామాల్లో అవాస్తవాలు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. గతంలో మంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దుచేయడం, వారిని భయభ్రాంతులకు గురిచేశారు తప్పితే ప్రజలు మెచ్చుకునేలా పాలన అందించలేదని గుర్తు చేశారు. అప్పటి పాలననే గుర్తు చేసుకుంటున్న ప్రజలు ఈసారి వారిని ఓడించడం ఖాయమన్నారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ జడ్యాడ జయరాం మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలంటే చదువు ఒక్కటే చాలదని దానితో పాటు సేవ చేయాలనే తపన ఉండాలనే విషయం అచ్చెన్నాయుడు తెలుసుకోవాలని అన్నారు. సమావేశంలో నాయకులు కింతల శేషగిరి, కణితి నారాయణమూర్తి, మడపాల సంజీవరావు, చిన్ని జోగారావు, అంబోడి విష్ణు, కవిటి ఎర్రన్న, కణితి గిరి, కవిటి వీరన్న పాల్గొన్నారు.

మాయ మాటలు నమ్మితే అభివృద్ధికి ఆటంకం



ఎస్‌డబ్ల్యూపీసీని ప్రారంభిస్తున్న నాయకులు

మందస: ప్రతిపక్షాలు చెప్పే మాయ మాటలు నమ్మితే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్ గుసిరి వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు అగ్గన్న సూర్యారావు అన్నారు. మండలంలోని మూలిపాడులో అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలు ఎంతో కీలకమైనవని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. ఇన్నాళ్లూ కనిపించని టీడీపీ నాయకులు గ్రామాల్లో ఇప్పుడు హడావుడి చేస్తున్నారని వారిని నమ్మవద్దన్నారు. గౌతు కుటుంబీకుల పాలనలో ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందన్నారు. ప్రజలంటే కపట ప్రేమ చూపిస్తున్న ప్రతిపక్ష నాయకులు గ్రామాల్లోకి వస్తే నిలదీయాలన్నారు. ఒక్క మూలిపాడు పంచాయతీలోనే రూ.6 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయని సర్పంచ్ వెంకటరావు చెప్పారు. అంతకు ముందు నిర్మాణం పూర్తి చేసుకున్న ఎస్‌డబ్ల్యూపీసీ, రహదారులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరసాడ రఘుపతిరావు, ఏపీఓ బి.వి.హరికృష్ణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు మడియా రామకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు యవ్వారి నాగేశ్వరరావు, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు పైల నారాయణరావు, పార్టీ నాయకులు సేనాపతి ఈశ్వరరావు, చిప్పల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గౌరహరిమహంతి, ఉపసర్పంచ్ రామచంద్రచౌదరి, దడ్డ కిరణ్‌కుమార్, కె.ప్రశాంత్, పీఎస్ బొంతు రమణ, సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

రుణాలు రీషెడ్యూల్ చేసుకోవాలి

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులందరూ ఈనెల 28వ తేదీలోగా ఏడుశాతం వడ్డీని చెల్లించి రుణాలను రెన్యువల్ చేయుంచుకోవాలని అధ్యక్షుడు బాడాన మురళీధర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గడువు దాటితే 13 శాతం అపరాద వడ్డీతో అసలు చెలించాల్సి ఉంటుందన్నారు. కాబట్టి 1బీ కాపీ, ఆధార్ కార్డు జిరాక్సుతో వెళ్లి వడ్డీని చెల్లించి, గడువులోగా రుణాలను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు.

ఆక్రమణలను అడ్డుకోవాలని వినతి

సోంపేట: బారువ సచివాలయం పరిధిలోని జగనన్న కాలనీలో ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలులేనప్పటికీ కొంతమంది ఆక్రమణలకు పాల్పడుతున్నారని, అధికారులు స్పందించి అరికట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు కోరారు. ఈ మేరకు సోంపేట డిప్యూటీ తహసీల్దార్ గిరికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. బారువకు చెందిన స్థానికులు ఉన్నారు.

ఎర్రన్నకు ఎన్ని భాషలొచ్చని ఎంపీని చేశారు?

- వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రశ్న



టెక్కలి: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

టెక్కలి: దివంగత కింజరాపు ఎర్రన్నాయుడుకు ఏమి ఇంగ్లిష్, హిందీ వచ్చని ఈ జిల్లా ప్రజలు గతంలో ఆయన్ని ఎంపీని చేశారని వైఎస్సార్‌సీపీ టెక్కలి మండల నాయకులు టి.కిరణ్‌కుమార్, కె.అజయ్‌కుమార్, పి.వైకుంఠరావు, బి.తులసీరావు తదితరులు టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడును ప్రశ్నించారు. ఇటీవల అచ్చెన్న టెక్కలి మండల పర్యటనలో భాగంగా వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జిపై వ్యంగ్యంగా మాట్లాడడాన్ని వారు తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం టెక్కలిలో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు హిందీ, ఇంగ్లిష్ రెండూ వచ్చని ప్రగల్భాలు పలుకుతున్నారని అయితే రెండుసార్లు ఎంపీగా గెలిచి జిల్లాను ఎంత మేరకు అభివృద్ధి చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. కేవలం ఎంపీ పదవితో ఢిల్లీలో ఎంజాయ్ చేయడానికి తప్పా జిల్లాను అభివృద్ధి చేయడంలో ఆయన ఎప్పుడో వైఫల్యం చెందారని మండిపడ్డారు. తనకు ఇంగ్లిష్, హిందీ రాదని అచ్చెన్న బహిరంగంగా ఒప్పుకోవడం సంతోషమన్నారు. అయితే తెలుగు కూడా పూర్తిగా రాదని ఆయన భాషా వ్యవహారశైలి వింటే అందరికీ అర్థమవుతుందన్నారు. గడచిన నాలుగున్నరేళ్లుగా ప్రతిపక్ష పాత్ర పోషించలేని అచ్చెన్నాయుడు ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో నియోజకవర్గంలో పర్యటనలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీతో పాటు టెక్కలి నియోజకవర్గంలో అచ్చెన్నకు ఓటమి తప్పదని.. ఇది తెలుసుకుని మతి స్థిమితం లేని వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రోహిత



రోహిత

సోంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం–ఆంధ్రా' పోటీల్లో బ్యాడ్మింటన్ బాలికల డబుల్స్ విభాగంలో సోంపేట పట్టణానికి చెందిన జక్కం రోహిత జిల్లా స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. సోంపేటలోని సంస్కారభారతి డిగ్రీ కళాశాలలో రోహిత చదువుతోంది. ఈమెను కళాశాల కరస్పాండెంట్, ఎంపీపీ నిమ్మన దాస్, చైర్మన్ ఎన్ని దేవరాజు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రంపై ఫిర్యాదు

మందస: బిన్నకమదనాపురం అంగన్‌వాడీ కేంద్రంపై వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకురాలు, సర్పంచ్ మార్పు భవానీ శనివారం రాష్ట్రమంత్రి సీదిరి అప్పలరాజు, ఐసీడీఎస్ పీవో కె.వసుంధరాదేవిలకు ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త విధులకు గైర్హాజరు అవుతున్నారని ఆరోపించారు. ఆమె ఎక్కడికి వెళ్లారో తెలియడంలేదన్నారు. గతంలో అక్రమాలకు పాల్పడగా పట్టుకుని, అధికారులకు ఫిర్యాదు చేసి, హెచ్చరించడం జరిగిందని.. అయినా మార్పు రావడంలేదన్నారు. ఈ విషయాన్ని పీవో వసుంధరాదేవి వద్ద ప్రస్తావించగా, తాను కూడా కేంద్రానికి విజిట్ చేశానన్నారు. కార్యకర్త అందుబాటులో లేరని, డిపార్ట్‌మెంట్ ఫోన్ నంబరుకు కూడా రెస్పాండ్ కావడం లేదని, చర్యలు తీసుకుంటామన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

ఇచ్ఛాపురం: పురపాలకసంఘం 14వ వార్డులో ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అధికారులు శుక్రవారం పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీసెల్ జనరల్ సెక్రటరీ నీలాపు ఢిల్లి అరుకుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం మొత్తాన్ని రూ. 5లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలుచేసిందన్నారు. కార్యక్రమంలో వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

సంతబొమ్మాళి: నౌపడ పంచాయతీ జగన్నాథపురం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. నౌపడ సర్పంచ్ పిలక బృందాదేవి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. 322 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డైరెక్టర్ పి.రవికుమార్‌రెడ్డి, డాక్టర్లు ప్రమీల, నందిని, జీఎస్ స్వరూప్, సందీప్, ప్రతాప్, పంచాయతీ కార్యదర్శులు ఉమాపతి, రవి పాల్గొన్నారు.

జేఏవోకు వీడ్కోలు

కాశీబుగ్గ: పలాస ఈఆర్‌వో (ఎలక్ట్రికల్ రీజనల్ ఆఫీస్)కార్యాలయంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసి జేఏఓ(జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్) దువ్వాడ మోహనరావుకు సిబ్బంది శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎం.వి.గోపాలరావు ముఖ్యఅతిథిగా హాజరై మోహనరావు దంపతులను సత్కరించారు. ఎంపీడీవో రమేష్‌నాయుడు, రీజనల్ ప్రెసిడెంట్ ఎస్.లోకేశ్వరరావు, బ్రాంచ్ అధ్యక్షులు గార రాజారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.శేఖర్, కోశాధికారి ఎం.హిమగిరి, ఏఈలు భూషణ్, వివేకానంద, శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండ, పలాసలోని వివిధ విభాగాలకు చెందిన విద్యుత్ ఉద్యోగుల సంఘాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

కవిటి: 'ఆడుదాం–ఆంధ్రా' జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన కవిటి–1 సచివాలయం జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించి విజయాన్ని దక్కించుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన ఫైనల్ పోటీలో నరసన్నపేట నియోజకవర్గం జట్టుపై సునాయా సవిజయాన్ని అందుకున్న కవిటి జట్టు రాష్ట్రస్థాయిలో పతకంతో మెరుస్తుందన్న ఆశాభావాన్ని ప్రకాష్ వ్యక్తం చేశారు. శుక్రవారం క్రీడాకారులను అభినందించగా.. ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, ఈవో జి.వీరభద్రస్వామి, పార్టీ నాయకులు శేఖర్, అశోక్, సంతోష్ ఉన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శిగా వినోద్



వినోద్‌కుమార్

కాశీబుగ్గ: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మద్దిల వినోద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల నెల్లూరులో శెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వినోద్ స్వగ్రామం పలాస మండలం చిన్న గురుదాసుపురం. ఈయన్ని పలు విద్యార్థి సంఘాల నాయకులు అభినందించారు.

చిన్నారులకు ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి గ్రామానికి చెందిన మల్లవరపు వెంకటలక్ష్మిని వివాహితను ఆమె భర్త విడిచిపెట్టగా, సంక్రాంతి రోజు ఈమె మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంది. ఈమెకు 2,4 తరగతులు చదువుతున్న చిన్నారులు శరణ్య, లిఖితలు అనాథులుగా మిగిలిపోయారు. ఇటీవల 'సాక్షి' దినపత్రికలో 'అమ్మ లేదు.. నాన్న రాడు' శీర్షికతో కథనం ప్రచురించడంతో పలువురు దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. ఇచ్ఛాపురం గ్రామానికి చెందిన 'బెల్లుపడ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్' సభ్యులు శుక్రవారం చిన్నారులకు రూ.10 వేలు నగదుతో పాటు నిత్యవసర సరుకులు, నూతన దుస్తులు అందజేశారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- టెక్కలి ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్



మలగాంలో మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతికార్యకర్త పని చేయాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మలగాం, బోరుభద్ర, పాలతలగాం, ఆర్.హెచ్‌పురం, జగన్నాథపురం, ఎస్.బి.కొత్తూరు, కాకరాపల్లి, గోవిందపురం పంచాయతీల్లో ఆయన శుక్రవారం పర్యటించి ప్రజలతో మాట్లాడారు. అన్ని వర్గాల వారు మెచ్చుకొనే సుపరిపాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి అందరి మన్నలను పొందుతున్నారని చెప్పారు. టెక్కలి అసెంబ్లీ, శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ కెళ్లి జగన్నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.అప్పారావు, పి.రవికుమార్‌రెడ్డి, నక్క భీమారావు, పి.రామకృష్ణ, కె.సతీష్, ఎస్.వెంకటేష్, ఎన్ని మన్మథరావు ఉన్నారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ



కోటబొమ్మాళి: వై.పద్మజ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ఎంపీడీవోగా వై.పద్మజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె విజయనగరం జిల్లా కొత్తవలస మండలాభివృద్ధి అధికారిగా పనిచేస్తూ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ కోటబొమ్మాలో పనిచేసిన కె.ఫణీంద్రకుమార్ మన్యం జిల్లా సాలూరు బదిలీపై వెళారు.

ఇచ్ఛాపురం ఎంపీడీవోగా...



ఇచ్ఛాపురం రూరల్: రాజేంద్రప్రసాద్‌కు అభినందనలు తెలియజేస్తున్న ఎంపీపీ పుష్ప, నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండలాభివృద్ధి అధికారిగా వై.వి.రాజేంద్రప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా బొండపల్లిలో పని చేస్తూ బదిలీపై ఇచ్ఛాపురం వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎం.ఈశ్వరరావు విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లిపోయారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ బోర పుష్ప, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు రాజేంద్రప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

వజ్రపుకొత్తూరు ఎస్సైగా రామారావు



వజ్రపుకొత్తూరు: బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై రామారావు

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు పోలీసుస్టేషన్ ఎస్సైగా చామంతుల రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన రామారావు జి.సిగడాంలో పని చేస్తూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఎస్సైకి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరల్లి ఉదయ్‌కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు.

కంచిలి ఎస్సైగా రాజేష్



జి.రాజేష్

కంచిలి: స్థానిక పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా గుండపు రాజేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇతను రణస్థలం మండలం జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్.బాలరాజు విశాఖపట్నం ఎయిర్‌పోర్టు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

కోటబొమ్మాళి తహసీల్దార్‌గా లచ్చుపాత్రుడు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి తహసీల్దార్‌గా పి.లచ్చుపాత్రుడు నియమితులయ్యారు. ఈ మేకరు జిల్లా కలెక్టర్ మనిజీర్ జిలానీ సమూన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈయన విశాఖ జిల్లా చింతపల్లి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన జామి ఈశ్వరమ్మ అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు బదిలీపై వెళ్లారు.

ఆస్పత్రులకు వెళ్లి.. పింఛన్లు అందజేసి..



ఇచ్ఛాపురం రూరల్: వల్లభరావుకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రాజు



కంచిలి: మాధవరావు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బెండి కుమారి

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధుడు దూపాన వల్లభరావు శ్రీకాకుళం రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈయనకు ఈ నెలకు సంబంధించి వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. దీంతో వెల్ఫేర్ అసిస్టెంట్ కూన రాజు, వలంటీర్ తెలుకల పుష్పలతలు శుక్రవారం 150 కిలో మీటర్ల దూరంలో ఉన్న జెమ్స్ ఆస్పత్రికి వెళ్లి వల్లభరావుకు పింఛన్ అందజేసి ఆదర్శంగా నిలిచారు.

కంచిలి: డోలగోవిందపురం సచివాలయం పరిధి రేఖాదేవిపురం గ్రామానికి చెందిన దుర్గాసి మాధవరావు పక్షవాతంతో శ్రీకాకుళంలోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఈయనకు మంజూరైన పింఛన్ డబ్బులను వలంటీర్ బెండి కుమార్ శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి అందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి ఇందిరమ్మ కాలనీలో ఉపాధిహామీ పథకం నిధులు రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ పిట్ట శశిరేఖ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పిట్ట మామయ్యారెడ్డి, పాతిర్ల వెంకటేష్, పాతిర్ల భీమారావు, ఆశి పారయ్య, ధర్మాన వెంకటరావు, తిప్పన కురయ్య, చిరంజీవి బెహరా, విష్ణు బెహరా, దుర్గాశి ధనయ్య, పాతిన జోగారావు, పాతిర్ల జోగారావు ఉన్నారు.

జె.బెల్లుపడ పంచాయతీలో..

కంచిలి: కేసరపడ సచివాలయం పరిధి జె.బెల్లుపడ పంచాయతీ కేంద్రంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ. 4.5 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అయిధం జయరాం, స్థానిక నేతలు మెండ ప్రకాశ్, ఇప్పిలి నీలయ్య పాల్గొన్నారు.

టెక్కలి చేరిన పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న వెంకటరామారావు

టెక్కలి: రాజకీయంగా, సామాజికంగా ఎంతో వెనుకబడి ఉన్న తెలగ కులస్తులను బీసీల్లో చేర్చాలని కోరుతూ ఆ సంఘం నాయకుడు పల్లంట్ల వెంకటరామారావు ఇచ్ఛాపురం నుంచి చేపట్టిన పాదయాత్ర శుక్రవారం టెక్కలి చేరుకుంది. ఈ మేరకు టెక్కలి మండలంలోని తెలగ సంక్షేమ సంఘం ప్రతినిధులంతా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకటరామారావు మాట్లాడుతూ.. అన్ని రకాలుగా వెనుకబడి ఉన్న తెలగ కులస్తులను బీసీల జాబితాల్లో చేర్చి ఆదుకోవాలని కోరారు. గతంలో పుట్టుస్వామి, మంజునాథ్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందజేశారని గుర్తు చేశారు. తెలగజాతి ఆత్మగౌరవ యాత్ర పేరుతో ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు పాదయాత్ర చేపడుతున్నట్టు చెప్పారు. స్థానిక సంఘం ప్రతినిధులు దోని కొండలరావు, ఇల్ల కోదండ, బి.పెంటయ్య, జి.దాసు, పువ్వల ఢిల్లేశ్వరరావు, ఐ.సోమేశ్వరరావు ఉన్నారు.

ఎస్టీ నిరుద్యోగులకు హోటల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ



మాట్లాడుతున్న ప్రసాదరావు

మందస: నిరుద్యోగులైన గిరిజన యువతీ, యువకులకు హోటల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు చెప్పారు. మందసలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ నెల ఐదో తేదీ నుంచి హోటల్ మేనేజ్‌మెంట్ (ఫుడ్, బెవరేజ్)లో 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. మందస మండలం కుంటికోట సమీపంలోని గిరిజన శిక్షణ కేంద్రం (వైటీసీ)లో శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండాలని, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, నాలుగు పాస్‌ఫొటోలు, కులధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. శిక్షణను నిరుద్యోగ గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న శ్రీరామమూర్తి

నందిగాం: సవరలింగుపురం ఆశ్రమపాఠశాల విద్యార్థులకు ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ తల్లిదండ్రులు సత్యమమ్మ–సన్యాసిరావునాయుడు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, నాయకులు పోలాకి మోహనరావు, అట్టాడ శ్రీనివాసరావు, కవిటి ఎర్రన్న, నందిగాం చిన్నబాబు ఉన్నారు.

తహసీల్దార్ సేవలు ప్రశంసనీయం



అప్పలస్వామిని సన్మానిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలంలో సుదీర్ఘ కాలం పాటు పని చేసి అందరి మన్నలు పొందిన తహసీల్దార్ బెల్లుకోల అప్పలస్వామి సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అప్పలస్వామిని వారు ఘనంగా సన్మానించారు. కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు, డీలర్ల సంఘం నేతలు ఆయన్ని దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వాయిలపల్లి గిరిరాజ్, ఎంఆర్ఐ డి.పవిత్ర, ఎస్సై వై.మధుసూదనరావు, ఈఓపీఆర్డీ డి.తిరుమలరావు, పలువురు సర్పంచ్‌లు ఉన్నారు.